# అంతుచిక్కని రహస్యం

ఢిల్లీలోని అపరాధ పరిశోధకశాఖకు చెందిన ఒక అధికారి, ఢిల్లీ రింగు రోడ్డులో వున్న విశాల భవనంలో ప్రవేశించాడు. ఆలోచిస్తూ లోపలకు నడుస్తున్నాడు.

ఆ భవనం యజమాని చాలా ధనవంతుడని వేరుగా చెప్పనక్కర్లేదు. ఆ అధికారికి ఆ భవన యజమాని బాలముకుంద మల్లిక్ తనను ఎందుకు ఫోన్‌చేసి వెంటనే రమ్మని అర్థించాడో అర్థంకాలేదు. ఆ విషయం గురించి ఆలోచిస్తూ అతను లోపలకు నడుస్తున్నాడు అన్యమనస్కంగా. ఆ అధికారి శ్రీమల్లిక్‌ను ఎప్పుడూ చూడలేదు.

వరండాలోనే ఒక అందమైన యువతి ఎదురైంది. ఆమె తెల్లగా పొడవుగా వున్నది. బాబ్డ్ హైర్ మెడమీద నుంచి రెండు భుజాలనూ కప్పుతోంది. ఆమెను చూడగానే "నాలుకలు చాచి పైపైకిలేస్తున్న అగ్నిశిఖలా వుంది" అనుకున్నాడు ఆ అధికారి.

"ఎవరు కావాలి?"

"శ్రీమల్లిక్ గారిని చూడాలి."

ఆమె వెనుదిరిగి రెండడుగులు వేసింది. ఆగి వెనక్కు తిరిగి ఆయన మిమ్మల్ని రమ్మన్నారా?'' అని అడిగింది.

అధికారి ఒక్కక్షణం ఆమె ముఖంలోకి చూసి "లేదు. నేనే

వచ్చాము. బిజినెస్ సంబంధంగా కొన్ని విషయాలు వారితో చర్చించ" అన్నాడు

''కూర్చోండి వారికి చెప్పివస్తాను. మీ పేరు?'' ఆమె అడిగింది.

''కృష్ణకుమార్ ఖోసలా!" అని ఆ పక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు ఆ అధికారి.

ఆ అధికారి ఆమెకు అసలు పేరు చెప్పలేదు. ముందుగానే ఆలోచించుకొని ఆ పేరు చెప్పాడు.

కొద్ది నిముషాల తర్వాత ఆ యువతి బయటికి వచ్చింది. "రండి"! అన్నది. అతను ఆమె వెనుకనే లోనికి ప్రవేశించాడు. కుడి వైపుగా వున్న ఓగదిని చూపిస్తూ "వెళ్ళండి'' అన్నది.

అతను లోపలకు వెళ్ళాడు.

ఆమె బయటవే వున్నది.

లోపల సోఫామీద ఒక వ్యక్తి కూర్చుని వున్నాడు. అతను గోధుమ రంగులో వున్నాడు. మెడ కన్పించడంలేదు. రెండు భుజాల మధ్య పెద్ద గుమ్మడికాయను అమర్చినట్లుంది అతని తల. తలమీద జుట్టులేదు. నున్నగా మెరుస్తోంది. ఆయన ముఖం లాగే ఆయన వేసుకున్న దుస్తులు కూడా వదులు వదులుగా వున్నాయ్.

"నమస్తే'' ఆ అధికారి చేతులు జోడించాడు.

ఆయన చేతిలో తన ఐడెంటిటీ కార్డును వుంచి దూరంగా వున్న మరో సోఫామీద కూర్చున్నాడు.

మల్లిక్ అతన్ని దగ్గరగా వచ్చి కూర్చోమని సైగతోనే చెప్పాడు. అతను మల్లిక్ సోఫా దగ్గరగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

ఆ వాతావరణంలో ఏదో రహస్యం దాగి వున్నట్టనిపించింది అతనికి. మౌనంగా చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

"నేను త్వరలోనే చనిపోతాననిపిస్తోంది" అంత లావు కంఠం లోనుంచి చిన్నగా మాటలు విన్పించాయి.

అతను ఆ మాటలు అన్న తీరుకు ఆ అధికారి చలించిపోయాడు. మల్లిక్ మీద జాలివేసింది. అయినా తన భావాలను ముఖంలో కన్పించ కుండా జాగ్రత్తపడుతూ, "అందరం ఏదో ఒకరోజు పోయేవాళ్ళమే! " అన్నాడు అతను.

ఆయన అదోలా నవ్వాడు. ఆ నవ్వులో విషాదం వున్నది. "అదికాదు నన్ను చంపడానికి కుట్ర జరుగుతున్నది" వణికే కంఠంతో అన్నాడు మల్లిక్.

"ఏ విధంగా"

"స్లో పాయిజన్!''

అధికారి నిటారుగా కూర్చున్నాడు. వెంటనే అతని బుర్రలో తను చూసిన ఆ యువతి మెదిలింది.

''అమె మీ కూతురా?"

"కూతురు లాంటిదే!''

"అంటే?''

"నా మిత్రుడి కూతురు. నాకు పిల్లలు లేరు. నా భార్య చని పోయింది. ఈ వయసులో మళ్ళీ పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. కొంతకాలం క్రితం నామిత్రుడు చనిపోయాడు. చదువుకొనే రోజుల్లో

అతను నాకెంతో సహాయం చేశాడు. ఆయనకు ఆమె ఒక్కతే కూతురు. భార్య లేదు. ఆస్తిలేదు. తన కూతురి బాధ్యత నేను తీసుకోవాలని అతని చివరి కోరిక. అలాగే తండ్రి పోగానే నేను అమెను నా ఇంటికి తీసుకొచ్చాను."

''ఆమె తండ్రికి బొత్తిగా ఆస్తి లేదా?''

''ఒకప్పుడు వుండేది. అతనికి లేని దురలవాటు లేదు. రేసుల పిచ్చి కూడా వుండేది. చచ్చేనాటికి అప్పులు మిగిలాయి."

"ఆ విషయం వదిలెయ్యండి. అసలు విషయం...." మళ్ళీ అందుకుని మధ్యలోనే ఆగిపోయాడు శ్రీమల్లిక్.

''అవును మీ జీవన్మరణ సమస్య!"

''కరెక్ట్!"

''మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?''

''ఉంది!''

''ఎవరిమీద? ముందు ఇది చెప్పండి. మీ ఇద్దరు కాక ఈ ఇంట్లో ఇంకెవరైనా వుంటున్నారా?'' అధికారి అడిగాడు.

"ఇద్దరు నౌకర్లు వుంటున్నారు"

''ఆ అమ్మాయి పేరు?"

''తృప్తి''

"మీ అనుమానం తృప్తి మీద...."ఆగి ఆ అధికారి మల్లిక్ ముఖంలోకి చూశాడు.

''ముందుగా నేను ఒకటి చెప్పాలి.''

''చెప్పండి''

''నాకు ఒక అన్న కొడుకు వున్నాడు. వాడిపేరు సత్యేంద్ర మల్లిక్. అందంగా వుంటాడు. బాగా చదువుకున్నాడు. అతనే నా ఆస్తికి వారసుడు. అప్పుడప్పుడు వచ్చి నాలుగు రోజులువుండి వెళతాడు. నేనంటే ప్రాణం పెడుతున్నట్టు మాట్లాడతాడు. కాని వాడు వచ్చి ఇక్కడ వున్న రోజుల్లోనే నా ఆరోగ్యంలో మార్పు వస్తోంది. వాడువెళ్ళ గానే మళ్ళీ మాములుగానే వుంటాను.''

ఆ మాటలు చెబుతున్నప్పుడు మల్లిక్ కళ్ళు సజలం కావడం అధికారి గమనించాడు. జాలి వేసింది.

"కాని ఒకటి ఆలోచించాలి. అతను ఇక్కడ వున్నప్పుడు మీకు స్లో పాయిజన్ ఎలా ఇవ్వగలడు? అతను మీ భోజనం తయారుచేస్తాడా? మీకు టీ తెచ్చి ఇస్తాడా? ఏమైనా ఫలహారాలు బజారు నుంచి తెచ్చి తినిపిస్తాడా?''

''అలాంటివి ఏమీ చెయ్యడు. కాని నా భోజనంలో ఏదైనా కలపవచ్చుగా?''

''అలా చెయ్యాలంటే అతను మొత్తం ఆహారంలోనే ఏదైనా కలపాలి. మీతో పాటు ఈ ఇంట్లో వున్న మిగతా వారి ఆరోగ్యం కూడా పాడవాలిగా?''

నాకు గ్యాస్ ట్రబుల్ వున్నది. నా భోజనం వేరుగా స్వయంగా తృప్తి తయారు చేస్తుంది. ఆ భోజనం నాగదిలోనే చేస్తాను.

''అలా చేసినందువల్ల సత్యేంద్రకు లాభం?'' ఆస్తిలో సగం వాడి పేరుమీదనే రాశాను. మూడో వంతు తృప్తికి రాశాను. మిగిలింది

మరో ఇద్దరు బంధువులకి రాశాను. విల్లురాశాను. నేను చస్తే వాడికి చాలా ఆస్తి వస్తుంది."

అధికారి ఆలోచనలో పడ్డాడు.

"నేను విల్లు మార్చాలనుకుంటున్నాను. ఈసారి సత్యేంద్ర పేరు లేకుండా చెయ్యాలని నా అభిప్రాయం"/

"అతను చాలా అందంగా వుంటాడా?''

''ఆ''

''తృప్తి కూడా చాలా అందంగా వుంటుంది. ఇద్దరూ కలసి....''

"కాదు - అతనికి తృప్తి అంటే ఇష్టంలేదు. అసలు నేను వాళ్ళిద్దరికీ పెళ్ళి చేద్దామనుకున్నాను. సత్యేంద్రకు తృప్తి అంటే చిరాకు. గర్విష్ఠి అంటాడు. ఆమెకు ఒక ఇంటి ఇల్లాలు అయ్యేఅర్హత లేదంటాడు'' అన్నాడు మల్లిక్.

వెనక కిటికీ దగ్గర ఏదో అలికిడి అయింది. ఆ అధికారి వెనక్కి తిరిగి చూశాడు. తృప్తి నిల్చుని వున్నది.

చిన్నగా పక్కకు తప్పుకుంది. అయినా అక్కడే తచ్చాడుతున్నట్లు ఆ అధికారికి అనిపించింది.

"కిటికీ దగ్గర తృప్తి వున్నదా!'' మల్లిక్ అడిగాడు.

"అవును!"

"ఈ పిల్లకు ఇదొక చెడ్డ గుణం! నాతో ఎవరైనా మాట్లాడటానికి వస్తే చాలు కిటికీ దగ్గర నిల్చుని చెవులు అప్పగిస్తుంది. మీరు ఆమెకు మీరెవరో చెప్పారా!''

"లేదు మేము అలా చెప్పం! ఆమెకు నేను సి. ఐ. డి. ఆఫీసర్నని తెలియదు. అది సరే! సత్యేంద్ర ఎక్కడ వున్నాడు?"

''వాడు రేపు ఇక్కడికి వస్తున్నాడు. నా బెంగ అదే!''

"నేను ఇక్కడే వుండవచ్చునా? అతన్ని దగ్గరగా కనిపెట్టే అవకాశం కావాలి ''

''తప్పకుండా!''

అంతలో తృప్తి లోపలకు వచ్చింది.

"అంకుల్" రాత్రికి ఏం వండమంటారు" అని అడిగింది.

''చూడు తృప్తి ఇతను కొద్ది రోజులు మన ఇంట్లోనే వుంటాడు. వ్యాపార సంబంధంగా వచ్చాడు.ఆ గెస్ట్ రూమ్ ఇవ్వండి" అని మల్లిక్ ఆఫీసరుతో "మీరు హొటల్లో దిగడం బాగాలేదు. ఇక్కడే వుండండి ఈ నాలుగు రోజులు'' అన్నాడు.

''అలాగే అంకుల్?'' అంటూ తృప్తి వెళ్ళిపోయింది.

ఆ ఆఫీసరు కూడా బయటికి వెళ్ళి రెండు గంటలలో ఒక సూట్ కేస్‌తో తిరిగి వచ్చాడు.

రెండో రోజు సత్యేంద్ర వచ్చాడు.

ఆ సమయంలో అఫీసర్ మల్లిక్ గదిలోనే వున్నాడు. సత్యేంద్ర లోపలకు వచ్చి బాబాయి పాదాలకు వినయంగా నమస్కరించాడు. మల్లిక్ వాళ్ళిదర్నీ ఒకరి నొకర్ని పరిచయం చేశాడు. సత్యేంద్ర ఉత్సాహంగా ఆఫీసరుతో చెయ్యి కలిపాడు.

ఆ సాయంత్రం లాన్‌లో ఇద్దరూ కూర్చున్నారు.

సత్యేంద్ర ''మీరుండటంవల్ల నాకు చాలా సంతోషంగా వుంది'' అన్నాడు.

''ఎందుకూ? నన్ను మీరు ఇంతకు ముందు ఎరుగరు''

''ఇక్కడ ఎవరూ నాతో మాట్లాడటానికి వుండరు. మహా బోర్‌గా వుంటుంది. అంకుల్‌ను చూడకుండా ఉండలేను, అందుకే అప్పుడప్పుడు వస్తుంటాను''

ఇద్దరూ చాలా సేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు.

రెండో రోజు ఉదయం మల్లిక్ సి. ఐ. డి. అధికారితో "రాత్రి తను అనారోగ్యానికి గురిఅయ్యానని, కడుపులో ఏదోబాధ కలిగిందని'' చెప్పాడు.

సత్యేంద్రతో అధికారి, రెండో రోజు సాయంకాలం కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుతున్నాడు. మాటల్లో అధికారి సత్యేంద్ర కళ్ళలోకి లోతుగా చూస్తూ ''రాత్రి మీ అంకుల్‌కి సుస్తీ చేసిందట!'' (అధికారిని సక్సేనా అనుకుందాం. ఎందుకంటె అతని పేరు ఈ కేసులో చెప్పడం జరగలేదు) సక్సేనా మాటకు సంత్యేంద్రి నవ్వుతూ ''ఇదేం కొత్తకాదు! నేను వస్తేచాలు మా అంకుల్ ఆరోగ్యం పాడవుతుంది!" అన్నాడు.

సక్సేనా ఆశ్చర్యంగా సత్యేంద్ర ముఖంలోకి చూస్తూ ''మీరేం అంటున్నారో మీకు తెలుసా?'' అన్నాడు.

అం నేను నిజమే చెపుతున్నాను. నేనిక్కడికి వస్తే చాలు అంకుల్ ఆరోగ్యం పాడయిపోతుంది. ఒక్కోసారి రావడం మానేద్దామని అనుకుంటాను. అంకుల్‌కి నేను తప్ప నా అనేవాళ్లు లేరు! అందుకే రాకుండా వుండలేక పోతున్నాను.''

"మీరు వచ్చినప్పుడే ఆయన ఆరోగ్యం చెడిపోవడానికి కారణం ఏమిటి అనుకుంటున్నారు." అంటూ సక్సేనా అనుమానంగా అతని ముఖంలోకి చూశాడు.

''అంకుల్‌కి నామీద అనుమానం? అందుకే ఆయన సైకలాజికల్‌గా" అలా భావిస్తున్నారు.

''ఏమని?"

''అదే! ఆయన భోజనంలో నేసేదో విషం కలుపుతున్నానని'' ఎలాంటి జంకూ గొంకూ లేకుండాచెప్పాడు సత్యేంద్ర.

''అందువల్ల మీకేం లాభం?'' అడిగాడు సక్సేనా.

''ఎందుకు లేదు? చాలా లాభం ఉంది!" ఆయన చనిపోతే ఆయన ఆస్తిలో సగం నాకే వచ్చేస్తుంది. ఆస్తి కోసమే నేనాయనికి స్లో పాయిజన్ ఇస్తున్నానని ఆయన అనుమానం. కాని నేనడిగిన డబ్బు అంకుల్ ఎప్పుతూ ఇస్తూనే వుంటారు. నాకలాంటి అవసరం ఎప్పుడూ లేదు. ఆయన కొంతకాలం పెద్ద దిక్కుగా ఉండాలనే నా కోరిక.

సక్సేనా ఆలోచనలో పడ్డాడు. మల్లిక్ దగ్గరకి వెళ్ళి ఆరోజు రాత్రి భోజనం రహస్యంగా అతనితో కలిసి చేస్తానని చెప్పాడు. ఆ రహస్యం ఇంట్లో ఎవరికీ తెలియకూడదని కూడా చెప్పాడు. అందుకు మల్లిక్ అంగీకరించాడు. తృప్తిని పిలిచి, బాగా ఆకలిగా వుందనీ ఎక్కువ పదార్థాలు చేసి పంపించమని చెప్పేడు. ఆరాత్రి సక్సేనా మల్లిక్ కోసం పంపించబడిన భోజనం తాను కూడా తిన్నాడు. పొద్దుపోయిన తరువాత తన గదికి వెళ్ళిపోయాడు సక్సేనా.

సక్సేనా పడుకున్నాడే కాని తన ఆరోగ్యం పాడయిపోతుందేమో

అనవసరమైన రిస్క్ తీసుకున్నానేమోననీ బాధపడసాగాడు. ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు.

రెండో రోజు ఉదయం సక్సేనా కొంచెం ఆలస్యంగా కళ్ళు తెరిచాడు. అతనికి తన ఆరోగ్యంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. 'టీ' తాగి స్నానం చేసి మల్లిక్ గదిలోకి వెళ్ళాడు.

మల్లిక్ ముఖం వాడిపోయి వున్నది. సక్సేనాని చూడగానే, "మళ్ళీ రాత్రి నా ఆరోగ్యం చెడిపోయింది. కడుపులో ఏదో మెలిపెట్టినట్టు అయింది. మీకెలా వుంది?" అనడిగాడు మల్లిక్.

"ఆశ్చర్యంగా వుందే? నాకేమీ కాలేదు మరి! మనిద్దరం ఒకే పదార్థం తిన్నాంకదా? నేను వెళ్ళిపోయేక మీరేమన్నా టీ గాని పాలు గానీ తాగారా?"

"అబ్బే అదేం లేదండి! నేనేం తీసుకోలేదు"

రెండో రోజు రాత్రి కూడా సక్సేనా మల్లిక్‌తో కలసే భోజనం చేశాడు.

ఆ రాత్రి కూడా సక్సేనా ఎలాంటి అనారోగ్యంతో బాధపడలేదు

తెల్లవారి మల్లిక్ మాత్రం తను రాత్రంతా కడుపు నొప్పితో బాధపడ్డానని చెప్పాడు. సక్సేనాకు మతిపోయినట్లయింది. సత్యేంద్ర దగ్గరకి వెళ్ళి అతన్ని వెంటనే ఊరికి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చాడు.

సత్యేంద్ర సక్సేనా మాట ప్రకారం వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయిన రాత్రి సక్సేనా మల్లిక్‌తో కలిసి భోజనం చేశాడు. రెండో రోజు ఉదయం రాత్రి ఎలాంటి బాధ కలగలేదని, హాయిగా నిద్ర పోయానని చెప్పాడు మల్లిక్. సక్సేనా నవ్వేశాడు.

మల్లిక్ ఉత్సాహంగా మార్నింగ్ వాక్‌కి బయల్దేరాడు. సక్సేనాని కూడా తనతో రమ్మన్నాడు.

"మీరెళ్ళరండి: నేను పేపరు చదువుకుంటూ వుంటాను!'' అన్నాడు సక్సేనా.

సక్సేనా మల్లిక్ బెడ్‌రూం ఎదురుగా వున్న హాల్లో పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు. 15 నిముషాలు గడిచాయి. తృప్తి మల్లిక్ బెడ్‌రూంలోకి వెళ్లింది. తరువాత బాత్‌రూంలోకి వెళ్ళింది. పేపరు పక్కన పెట్టి సక్సేనా ఆమె వెనకే వెళ్ళాడు మెల్లగా.

తృప్తి వెనక్కి తిరిగి చూసింది. సక్సేనాని చూడగానే ఆమె ముఖం వెలావెలా పోయింది. ఆమె చేతుల్లో ఒకే బ్రాండ్‌కి సంబంధించిన రెండు టూత్ పేస్టులున్నాయి. అవి రెండూ సక్సేనా లాక్కున్నాడు.

''తృప్తిగారు! ఇక మీ ఆట కట్టింది'' అన్నాడు సక్సేనా.

సక్సేనా ట్యూబుల్ని తీసుకుని తృప్తిని బాత్‌రూంలోనే వుంచి తలుపులు మూసేశాడు. మల్లిక్ బెడ్‌రూంలో కూర్చుని అతని కోసం ఎదురు చూడసాగాడు.

మల్లిక్ వాకింగ్ నుంచి తిరిగివచ్చాడు. "అరే మీరింకా ఇక్కడే వున్నారా! నేనిప్పుడే వస్తాను బాత్‌రూంకి వెళ్ళి" అన్నాడు మల్లిక్.

''ఆగండి! ఆ బాత్‌రూం తలుపు తెరవకండి" అన్నాడు సక్సేనా

''అసలు విషయం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు మల్లిక్.

"మీరు తాపీగా కూర్చోండి చెప్తాను?'' అన్నాడు సక్సేనా. మల్లిక్ అయోమయంగా చూశాడు.

''మల్లిక్ సాబ్! మీ అనుమానం కరక్టే.

మీకు స్లోపాయిజన్ ఇవ్వబడుతోంది. అది మీరూహించినట్టు సత్యేంద్ర ద్వారా జరగటంలేదు. తృప్తి ఈ పని చేస్తోంది. ఎందుకో తెలుసా? మీకు సత్యేంద్ర మీద అనుమానం వచ్చి, సత్యేంద్ర పేరును విల్లులోంచి తీసేస్తారు. ఆ ఆస్తిని కూడా మీరు తృప్తికే ఇస్తారు. ఆ ఆలోచనలతోనే ఆమె ఇలా చేస్తుంది." /

''కాని నాకు ఆమె విషం ఎలా ఇస్తోంది?''

ఈ రెండు ట్యూబుల్ని చూడండి. రాత్రి భోజనం తరువాత మీకు పండ్లు తోముకునే అలవాటుంది. సత్యేంద్ర వచ్చినప్పుడంతా స్లోపాయిజన్ వున్న ట్యూబును మీ బాత్‌రూంలో పెట్టి మంచి ట్యూబుని తీసేస్తోంది. ఉదయం మళ్లీ ట్యూబ్ మారుస్తుంది.

"సత్యేంద్ర వెళ్లిపోయేక పూర్తిగా విషం కలిసిన ట్యూబును తీసేస్తూవుంటుంది. అందుకే సత్యేంద్ర వున్నప్పుడు మాత్రమే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది." అని వివరించాడు సక్సేనా.

కొద్ది నిముషాల పాటు స్థాణువులా నిలబడిపోయాడు మల్లిక్.

''హే భగవాన్! అనవసరంగా నేను నా అన్న కొడుకుని అనుమానించాను. ఈ పిల్ల-ఈ పిల్లను నేను స్వంత బిడ్డలా చూస్తున్నాను. అయినా ఇది నా ప్రాణం తీయటానికి సిద్ధం అయింది" తనకు తానే చెప్పుకుంటున్నట్టు చిన్నగా అన్నాడు మల్లిక్.

''అసలు రహస్యాన్ని ఛేదించాను. నాపని అయిపోయింది. ఇక నేను వెళ్ళొస్తాను. సెలవిప్పించండి!'' సక్సేనా మల్లిక్ నుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆతరువాత ఏంజరిగిందీ సి.ఐ.డి. డిపార్ట్‌మెంట్ రికార్డులో లేదు.